ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -37 పేజీలు - 05 వెల - 04/- మంగళవారం 27 జనవరి 2026

# స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా కూటమి అడుగులు

## అమరావతి గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్



- 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం అడుగులు
- సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోంది
- ప్రజలకు మరింతం చేరువగా ప్రభుత్వ సేవలు
- సామాజి పెన్షన్లు, 3 సిటిండర్లతో పేదలకు అండ
- రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి

**అమరావతి,:జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. జీరో పావర్టీ, ఎన్టీఆర్ భరోసా ద్వారా పెన్షన్ అందించి పేదలకు అండగా ఏపీ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. సేవలను వేగవంతంగా, జీవనాన్ని సులభంగా, పరిపాలనను మరింత తెలివైనదిగా మార్చుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే.. సేవల అందించడం మెరుగుపరచడం, ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తుందన్నారు. మిగతా 2లో...





# కన్నుల పండువగా కర్తవ్యపథ్





- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవాలు
- సైనిక వందనాన్ని స్వీకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- సైనిక పాటవాన్ని చాటిన పరేడ్
- ప్రత్యేక ఆకర్షణగా 'ఆపరేషన్ సిందూర్' ఆయుధ వ్యవస్థలు
- సాంప్రదాయ బగ్గీలో యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు
- ఆంటానియో కోస్టా, యురోపియన్ కమిషన్
- అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లు

**న్యూఢిల్లీ :జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

దేశ 77వ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని సాయుధ బలగాల శక్తి సామర్థ్యాలను, సైనిక పాటవాన్ని చాటేలా ఉత్సాహభరితమైన వాతావరణంలో, కన్నుల పండువగా పరేడ్ (కవాతు)ను నిర్వహించారు. మిగతా 2లో...

## నేడు బ్యాంకుల సమ్మె... స్తంభించనున్న పలు సేవలు!

- వారానికి 5 రోజుల పని కోసం ప్రభుత్వ బ్యాంకుల సమ్మె
- మంగళవారం దేశవ్యాప్తంగా సేవలకు అంతరాయం
- వరుసగా మూడు రోజులు మూతపడనున్న బ్రాంచులు
- ప్రైవేట్ బ్యాంకుల కార్యకలాపాలు యథాతథం




**న్యూఢిల్లీ ::జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలకు మంగళవారం అంతరాయం కలగనుంది. వారానికి ఐదు రోజుల పనిదినాలు డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఖఫీదీఖ) సమ్మెకు పిలుపునిచ్చింది. ఆదివారం సెలవు, సోమవారం గణతంత్ర దినోత్సవం కావడంతో ఇప్పటికే రెండు రోజులు బ్యాంకులు మూతపడ్డాయి. మిగతా 2లో...

# తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌తో పెరిగిన ఇమేజ్
- మూడు ఎకనమిక్ జోన్లుగా రాష్ట్ర విభజన
- సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయింపు
- 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ
- ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందచేత
- గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జిష్టుదేవ్ వర్మ



**హైదరాబాద్,:జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని గవర్నర్ ఎగరవేశారు.పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని.. ఈ డాక్యుమెంట్ హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా విభజించి, కీలక రంగాలకు ప్రత్యేకమైన జోన్లు ఏర్పాటు చేయాలని మిగతా 2లో...

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై మోదీకి ధర్మాన లేఖ

- మీరు తెచ్చిన చట్టాన్ని జగన్ ప్రభుత్వం అమలు చేసిందన్న ధర్మాన
- కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసిందన్న మాజీ మంత్రి




**అమరావతి, :జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ సహకారంతో తయారు చేసిన ముసాయిదా చట్టాన్ని గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ చట్టాన్ని రద్దు చేశారని లేఖలో పేర్కొన్నారు."మీరు తీసుకువచ్చిన గ్రామాల సర్వే, గ్రామ ప్రాంతాల్లో అభివృద్ధి చారిత్రాత్మక నిర్ణయం. 566.23 కోట్ల రూపాయలతో 3.20 లక్షల గ్రామాల్లో డ్రోన్ సర్వే విజయవంతంగా పూర్తి చేశారు. జాతీయ భూ రికార్డులమిగతా 2లో...

## భారత్‌తో మాది చారిత్రక బంధం

: రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

- ప్రపంచంలోనే పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్యాల మధ్య చారిత్రక బంధం ఉందన్న ట్రంప్
- భారతీయులకు విషెస్ చెప్పిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో
- ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళతామని వెల్లడి



## పాలనలో సాంకేతికత వినియోగం

- ఉద్యోగులపై పనిభారం తగ్గించేందుకు చర్యలు
- కృత్రిమ మేధతో త్వరితగతిన సమస్యల పరిష్కారం
- టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా 2026
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, :జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

పరిపాలనలో సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉద్యోగులపై పనిభారం తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఉన్నతస్థాయి అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్షించారు. సాంకేతికతలో ఉద్యోగులకు సమర్థవంతమైన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సీఎం సూచించారు. శిక్షణ సమయంలో ఉద్యోగులు అందుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించాలన్నారు. టెక్నాలజీని అధికారులు, ఉద్యోగులు వినియోగించుకునే విధంగామిగతా 2లో...



## విజయవాడ లోక్‌భవన్‌లో ఎట్‌హోం

- అతిథులను ఆహ్వానించిన గవర్నర్
- చంద్రబాబు, పవన్ కళ్యాణం దంపతులతో హాజరు

**అమరావతి, :జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ లోక్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం జరిగింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు,మిగతా 2లో...

# స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా కూటమి అడుగులు

(మొదటి పేజి తరువాయి)

దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఎల్పీజీ సిలెండర్లను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని స్త్రీ శక్తి పథకం ద్వారా అందిస్తోందని చెప్పారు. రూ.978 కోట్ల నిధులను ప్రధానమంత్రి స్వనిధి కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. పది సూత్రాలు అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని వివరించారు. ఇక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో సామాజిక పెన్షన్లు అత్యంత కీలకమైనవని అభివర్ణించారు. ప్రతి నెలా 63 లక్షల మందికిపైగా ప్రజలకు సామాజిక పెన్షన్లు అందిస్తున్నట్లు గుర్తు చేశారు గవర్నర్. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందన్నారు. అలాగే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. నీటి భద్రత ప్రభుత్వ విధామని చెప్పారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది కలగకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. అందుకోసం పొలం పిలుస్తోంది, రైతన్న మీా కోసం, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వివరించారు. నేటి గణతంత్ర వేడుక చరిత్రాత్మకమని అభివర్ణించారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన రాష్ట్రానికి స్పష్టమైన దిశ లేకుండా నిలిచిపోయిందని పేర్కొన్నారు. దాంతో రాజధాని నిర్మాణం సైతం ఆగిపోయిందని గుర్తు చేశారు. ఆర్థిక విశ్వాసం దెబ్బతిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే ? ప్రగతికి నిజమైన శిల్పులని అభివర్ణించారు. ప్రభుత్వ ప్రతి చర్య, ప్రతి సంస్కరణ, ప్రతి సమీక్ష ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ వృద్ధిని పునరుద్ధరించడానికే ఉద్దేశించబడిందని స్పష్టం చేశారు. ఈ ప్రయాణం సులభం కాదు.. దీనికి క్రమశిక్షణ, సహనశక్తి, సామూహిక లక్ష్యంపై అపారమైన విశ్వాసం అవసరమయ్యాయన్నారు. ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా
కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని.. సంస్థలు తిరిగి బలపడుతున్నాయని.. ప్రజల విశ్వాసం మళ్లీ స్థాపితమవుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పునరుద్ధరణ మార్పు ప్రయాణం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఈ దిశను మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. ఈ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణను ఒక స్పష్టమైన దృష్టిలో స్థిరపరిచిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి, బలమైన, సమగ్ర, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సుపరిపాలనకు పది సూత్రాలు.. పేదరికం లేని సమాజం, యువగళం, జనాభా నిర్వహణ - మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఆగ్రి టెక్, మౌలిక సదుపాయాలు, ఇంధనం, బ్రాండ్ ఏపీ, స్వచ్ఛంధ్ర, స్మార్ట్ గవర్నెన్స్ లక్ష్యాలను జస్టిస్ అబ్దుల్ వివరించారు. ఈ పది మార్గదర్శక సూత్రాల ఆధారంగా సాధించిన పురోగతిని, రాష్ట్ర దిశను, గమ్యాన్ని నిర్వచిస్తున్న విజయాలను ప్రజల ముందుంచడం గర్వకారణమని గవర్నర్ అభివర్ణించారు.
అతి త్వరలోనే భారతదేశంలో తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతి క్వాంటం వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు ద్వారా అంతరిక్ష సాంకేతిక స్టార్టప్‌లు, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను




ఆవిష్కరణల అగ్రగామి కేంద్రంగా నిలబెడుతున్నామన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కృత్రిమ మేధ , బ్లాక్ చెయిన్ సాంకేతికతలను సమన్వయం చేస్తూ, పాలనలో పారదర్శకతను సామర్థ్యాన్ని మరింత పెంచుతోందని తెలిపారు. ఆరోగ్య రంగంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ కోసం ఏఐ ఆధారిత వైద్య నిర్ధారణ సేవలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. వాట్సాప్‌లోనే 119 ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. సర్టిఫికెట్లు పొందడం, సంక్షేమ పథకాల స్థితిని తెలుసుకోవడం, ఫిర్యాదులు నమోదు చేయటం తదితర అంశాలు ఇప్పుడు క్షణాల్లో సాధ్యమవుతున్నాయన్నారు. ఇప్పుడు పాలన ఒక మెసేజ్ దూరంలోనే ఉందని చమత్కరించారు. భారతదేశంలోనే డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని చెప్పారు. కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో 300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలు.. ఏపీని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా కర్తవ్యపథ్

(మొదటి పేజి తరువాయి)

'150సంవత్సరాల వందేమాతరం' థీమ్ ప్రధానంగా కర్తవ్య పథ్‌లో ఈ ప్రదర్శన జరిగింది. బ్రహ్మోస్, ఆకాశ్, రాకెట్ లాంచర్ సూర్యాస్త్ర, ప్రధాన యుద్ధ ట్యాంక్ అర్జున్ సహా ప్రధాన ఆయుధ వ్యవస్థలను, క్షిపణులు, యుద్ధ విమానాలు, కొత్తగా ప్రారంభించిన యూనిట్లు అన్నింటినీ ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. ప్రధానంగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలన్నీ ఈ పరేడ్‌లో కొలువుతీరాయి. 'ఆపరేషన్ సిందూర్'లో ఉపయోగించిన పలు దేశీయ ఆయుధ వ్యవస్థలతో వచ్చిన భారత సైనిక శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్‌కు వాడిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ అందరినీ ఆకట్టుకుంది. 'వివిధత్వంలో ఏకత్వం' అన్న ఇతివృత్తాన్ని ప్రదర్శించేలా సాగిన ఈ పరేడ్‌కు అగ్ర భాగాన దాదాపు వంద మంది కళాకారులు నాయకత్వం వహించారు. బ్రహ్మాండంగా సంగీత వాయిద్యాల ప్రదర్శనతో దేశ ఐక్యత, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యతలను ప్రదర్శిస్తూ కవాతు సాగింది. పరేడ్‌కు ప్రారంభ సూచకంగా భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు ప్రేక్షకులపై పూల జల్లులు కురిపించాయి. మరోవైపు గగనతలంలో యుద్ధ విమానాలు పలు ఆకృతులతో చేసిన విన్యాసాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భారత వైమానిక దళానికి చెందిన నాలుగు హెలికాప్టర్లు కర్తవ్యపథ్‌పై ఎగురుతూ జాతీయ పతాకంతో పాటూ త్రివిధ దళాల పతాకాలను



ప్రదర్శించాయి. ఐఏఎఫ్ కు చెందిన రాఫెల్ జెట్‌లు వజ్రాంగ్ ఫార్మేషన్‌లో విన్యాసాలు నిర్వహించాయి. భారత స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖుల చిత్రపటాలతో స్కూలు పిల్లలు పరేడ్‌లో పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటానియో కోస్టా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లు సాంప్రదాయ బగ్గీలో కర్తవ్య పథ్‌కు చేరుకున్న వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైనిక వందనాన్ని స్వీకరించారు. దాంతో పరేడ్ ప్రారంభమైంది. ప్రధాని మన్మోహన్ సింగ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, దేశ త్రివిధ దళాధిపతులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ శుభాకాంక్షలు**

వికసిత భారత్‌ను నిర్మించాలనే మన ఉమ్మడి కర్తవ్యంలో ఈ రోజు నూతన ఉత్సాహాన్ని, సంకల్పాన్ని నింపాలని ప్రధాని మోడీ దేశ ప్రజలకు పిలుపిచ్చారు. ఈ



సందర్భంగా దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను తెలియచేశారు. వికసిత్ భారత్‌లో మహిళల పాత్ర శ్లాఘనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా కొనియాడారు. దేశ ప్రజలకు శుభాకాంక్షలు అందచేశారు.

**విజయవంతమైన భారత్ ప్రపంచాన్ని మరింత సుస్థిరం చేస్తుంది : ఉర్సులా వాన్ డెర్ లేయన్**

విజయవంతమైన భారతదేశం ప్రపంచాన్ని మరింత సుస్థిరంగా, సంపద్వంతంగా, భద్రంగా తయారుచేస్తుందని యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అన్నారు. దాన్నుండి మనందరం ప్రయోజనాలు పొందుతామన్నారు. భారత గణతంత్ర ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఉత్సవాల అనంతరం సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు.

# తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. మేడారం అభివృద్ధి కోసం రూ.251కోట్లు కేటాయించినట్లు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని ఆయన పేర్కొన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు, ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780కోట్లు అందజేశామని గవర్నర్ తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని గర్వంగా చెప్పారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, ఇప్పటివరకు 62 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన తెలిపారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని గవర్నర్ తెలిపారు. బ్యాంకుల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామని, మహిళలను పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీ అ÷-దదె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం.. 27 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని గవర్నర్



తెలిపారు. తెలంగాణలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో 3.35 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని, చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, హిల్ట్ పాలసీతో కాలుష్య పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తామని గవర్నర్ వెల్లడించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. అమెరికా పర్యటనలో ఉండటంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరుకాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సందేశమిచ్చారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన ఈ రోజును భారతదేశ చరిత్రలో ముఖ్యమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు.

# నేడు బ్యాంకుల సమ్మె...

(మొదటి పేజి తరువాయి)

ఇప్పుడు సమ్మె కారణంగా వరుసగా మూడో రోజు కూడా బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండవు. ఈ నెల 23న చీఫ్ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకే మొగ్గు చూపుతున్నట్లు బ్యాంకు సంఘాలు ప్రకటించాయి. ఈ సమ్మె ప్రభావంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రాదీ×), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (గాచీదీ), బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ప్రభుత్వ బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్స్ వంటి సేవలు స్తంభించనున్నాయి.
అయితే, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి. వాటి ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొనడం లేదు. యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలకు పెద్దగా ఇబ్బందులు ఉండకపోవచ్చని అంచనా. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రభుత్వ బ్యాంకులు తమ కార్యకలాపాలపై సమ్మె ప్రభావం ఉండొచ్చని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చాయి. ప్రతి నెలా మొదటి, మూడు, ఐదో శనివారాలు బ్యాంకులు పనిచేస్తున్నాయి. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించాలన్నది ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్. దీనిపై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో ఒప్పందం కుదిరినా, ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలుపై మోదీకి ధర్మాన లేఖ

(మొదటి పేజి తరువాయి)

ఆధునికీకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారు" అని ఆయన అన్నారు. భూ రికార్డులను ఆధునికీకరించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపారు. మీరు తెచ్చిన చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో గత జగన్ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, 2024లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా ప్రతిపాదించిన ముసాయిదా చట్టాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రులతో మీరు ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ చట్టం అమలును సమీక్షించాలని ధర్మాన ప్రసాదరావు ప్రధాని మోదీని లేఖలో కోరారు.

# భారత్‌తో మాది చారిత్రక బంధం

## : రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

న్యూఢిల్లీ ::**జనవరి 26, ఆంధ్ర ప్రగతి**

భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది. క్వాడ్ వేదికగా బహుళస్థాయి భాగస్వామ్యంతో ఇరు దేశాలకు, ఇండో-పసిఫిక్ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతోంది" అని రూబియో తన ప్రకటనలో వివరించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను చాటుతూ దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ పరేడ్, దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తారు.

# విజయవాడ లోక్‌భవన్‌లో ఎట్‌హోం

(మొదటి పేజి తరువాయి)



కొల్లు రవీంద్ర, సవిత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్జీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నేతలు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ లోక్ భవన్‌లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఎం చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి హాజరుకాగా.. పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన సతీమణి అన్నా కొణెదల కూడా ఈ తేనీటి విందులో పాల్గొన్నారు. ఇక, ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే. ఈశ్వరయ్య.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్.. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సహా తదితరులు హాజరయ్యారు. అతిథులతో మమేకమై గవర్నర్ అబ్దుల్ నజీర్ అభివాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ ప్రాముఖ్యతపై నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

# పాలనలో సాంకేతికత వినియోగం

(మొదటి పేజి తరువాయి)

ప్రోత్సహించాలని నిర్దేశించారు. 2026ను టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా చంద్రబాబు అభివర్ణించారు. కృత్రిమ మేధను వినియోగించడం ద్వారా ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తామని వెల్లడించారు. కాగా, మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటి వరకూ కోటీ43 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు.

# గణతంత్ర దినోత్సవ బహుమతులు అందుకున్న విద్యార్థులు.

**-లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ విద్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు.**

**-భవనాశి నాగ మహేష్ సౌజన్యంతో విద్యార్థులకు 120 బహుమతుల పంపిణీ.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:**



నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సంజీవనగర్ శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల రావు అధ్యక్షతన జరిగిన వేడుకలలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు జాతీయ పతాకావిష్కరణ చేసి పతాక వందనం చేశారు. రిపబ్లిక్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు భవనాశి శ్రీరామ మూర్తి జ్ఞాపకార్థం భవనాశి నాగ మహేష్ సౌజన్యంతో 120 బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుమల రావు, బహుమతుల దాత భవనాశి నాగ మహేష్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు రవి ప్రకాష్, మహేశ్వర రెడ్డి, కశెట్టి చంద్రశేఖర్, పోసిన సుబ్బారావు,కూరా ప్రసాద్, మామిళ్ల నాగరాజు, కన్నయ్య, సందీప్, రామకృష్ణుడు,భవనాశి సాయి శ్రీ హిత్ పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్.

**17 సంవత్సరాల లోపు బాల బాలికల చదరంగం పోటీలు.**

**ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 25:**
ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి 17 సంవత్సరాల లోపు బాల బాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ అధ్యక్షులు, కామినేని పల్లె సర్పంచ్ మేరువ చిన్న నరసింహారెడ్డి చదరంగం బోర్డ్ పై పావులు కదిలించి లాంఛనంగా టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధాశక్తిని పదును పెడుతుందన్నారు. విద్యార్థులలో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర సాయి పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని అన్నారు. మేరువ చిన్న నరసింహారెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా గెలుపు,ఓటములను స్వీకరించే ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. గెలిచినవారు మళ్లీ గెలవాలని, ఓటమి చెందిన వారు నిరంతర సాధన ద్వారా భవిష్యత్తులో గెలుపు సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ప్రముఖ సర్జన్ డాక్టర్ నీలా ప్రసాద్, నరసింహారెడ్డి, నాగేశ్వరరెడ్డి, క్రీడాకారులు వారి శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య వైజ్ఞానిక సదస్సు.

**సదస్సు ప్రారంభించిన ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 25:** నంద్యాలకు చెందిన 14 మంది వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వక్తలుగా ప్రసంగించారు.సదస్సులో ప్రసంగించిన డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి, డాక్టర్ వరదరాజ్, డాక్టర్ హిందూమతి, డాక్టర్ కోటి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ రవీందర్, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ శివ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ పవన్.

వైద్యులు నిరంతరం తమ వైద్య పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి: డాక్టర్ రవి కృష్ణ.

నంద్యాల ఐఎంఏ, నంద్యాల యూరాలజీ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ అకాడమిక్ విభాగం,మహిళా వైద్య విభాగం నిర్వహణలో ఆదివారం స్థానిక మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో వైద్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ శాఖకు చెందిన 14 మంది వివిధ స్పెషాలిటీ విభాగాలకు చెందిన వైద్యనిపుణులు మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించి వైద్య రంగంలో వస్తున్న వినూత్న విధానాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన, నంద్యాల యూరాలజీ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ భార్గవ్ రెడ్డి పర్యవేక్షణలో ,ఐఎంఏ నంద్యాల అకాడమిక్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత ల నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఒకే శాఖ కు చెందిన 14 మంది వైద్య నిపుణులు వక్తలుగా సదస్సు నిర్వహించడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి కావడం విశేషమని అన్నారు. వైద్యులు తమ వైద్య పరిజ్ఞానాన్ని నిరంతరం పెంచుకుంటూ నూతన ఆవిష్కరణలు, చికిత్సలు గురించి తెలుసుకోవాలని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఆస్కారం ఏర్పడుతుందని అన్నారు. అందుకోసమే ఈ నిరంతర వైద్య విద్యా సదస్సులు వైద్యుల కోసం నిర్వహిస్తున్నామని అన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులుగా వచ్చిన డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈ సదస్సుకు రెండు అకాడమిక్ క్రెడిట్ పాయింట్స్ కేటాయించారని, ప్రాక్టీస్ చేస్తున్న ప్రతి వైద్యుడు సంవత్సరానికి ఇటువంటి ఆరు పాయింట్లు కలిగి ఉండాలని, వారు తమ రిజిస్ట్రేషన్ ను రెన్యువల్ చేసుకునే సమయంలో ఈ పాయింట్లను పరిగణనలోనికి తీసుకుని మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయడం జరుగుతుందని అన్నారు. సదస్సులో వివిధ అంశాలపై డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి, డాక్టర్ వరదరాజ్, డాక్టర్ హిందూమతి, డాక్టర్ కోటి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ రవీందర్, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ శివ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ పవన్ ప్రసంగించారు. ఐఎంఏ నంద్యాల అకాడమిక్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత, కోఆర్డినేటర్ డాక్టర్ సుష్మ, కోశాధికారి డాక్టర్ శశికిరణ్ లు ఈ సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధిక సంఖ్యలో నంద్యాల పరిసర ప్రాంతాల వైద్యులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ వసుధ, డాక్టర్ హరిత, నంద్యాల మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, కార్యదర్శి డాక్టర్ శైలజ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద పాల్గొన్నారు.


# గణతంత్ర దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం.

## నిర్వహించిన వందే మార్ట్ ( వి మార్ట్).

**రక్తదాన శిబిరం ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ. -రక్తదానం చేసిన 40 మంది దాతలు.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:**
77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని శ్రీనివాస్ నగర్ లో ఉన్న వందే మార్ట్ ( వి మార్ట్) ఆధ్వర్యంలో,వందే మార్ట్ నిర్వాహకులు చంద్రశేఖర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రాఘవేంద్రల నిర్వహణలో, విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ జాతీయ పతాకావిష్కరణ చేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాతీయ పతాక ఆవిష్కరణతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించడం ప్రశంసనీయమని నిర్వాహకులను అభినందించారు. వందే మార్ట్ నిర్వాహకులు మల్లికార్జున రెడ్డి, రాఘవేంద్ర లు మాట్లాడుతూ తమ సూపర్ మార్కెట్ల వద్ద ప్రతి ఏటా స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల్ని నిర్వహించడంతోపాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తమ ఉద్యోగులు రక్తదానం చేస్తున్నామన్నారు. 2026 వ సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవం పురస్కరించుకుని తమ వందే మార్ట్ సూపర్ మార్కెట్ లలో 5000 రూపాయల పైగా విలువ చేసే వంటగది వస్తువుల సెట్ 2026 రూపాయలకే ప్రజలకు అందించామని తెలిపారు.

రక్తదాన శిబిరంలో 40 మంది దాతలు రక్తదానం చేశారు. వారికి పండ్లు, బ్లడ్ బ్యాంక్ తరపున ప్రశంసా పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో వందే మార్ట్ నిర్వాహకులు చంద్రశేఖర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రాఘవేంద్ర, భరత్ కుమార్ రెడ్డి, గణేష్ రెడ్డి, ఎల్లారెడ్డి,విజయ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రహమతుల్లా, రక్తదాన శిబిర నిర్వాహకులు దాదా నజీర్, సద్దాం, వందే మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో ఉమ్మడి జిల్లాల విజిలెన్స్ ఎస్పి ప్రత్యేక పూజలు..!

**-ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.**





**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు /పాణ్యం జనవరి 26:**
ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామాల్లో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి సన్నిధిలో "ఉమ్మడి జిల్లాల విజిలెన్స్ ఎస్పి చౌడేశ్వరి" మాఘ మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, కంపమల్ల నారాయణ శర్మ సిబ్బంది ఆలయ మర్యాదలైన పూర్ణకుంభంతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు స్వామివారి కంకణ ధారణ, శాలువాలు, శేష వస్త్రములు, పూలమాలతో ఘనంగా సత్కరించి, ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో

# వైభవంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు.












**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:**
బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా, దేశభక్తి వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ మరియు ఆయన సతీమణి శ్రీమతి రమ్య రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ సుధాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. భారత రాజ్యాంగ విలువలు, దేశ స్వాతంత్ర్యానికి త్యాగం చేసిన మహనీయుల సేవలు, విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాల్సిన అవసరం గురించి ఆయన తన సందేశాన్ని తెలిపారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. పిరమిడ్ ప్రదర్శనలు, హూలాహూప్ నృత్యాలు, దేశభక్తి స్కిట్లు, ప్రసంగాలు, మైమ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు చేసిన ఫ్యాన్సీ డ్రెస్సులు కార్యక్రమానికి మరింత శోభను తీసుకొచ్చాయి.

పాఠశాల ప్రాంగణం అంతా కాషాయం, తెలుపు, పచ్చ రంగులతో అలంకరించబడి, దేశభక్తి భావోద్వేగాలతో మార్మోగింది. ఈ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యత, బాధ్యత భావాలను పెంపొందించాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.







# దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుల త్యాగాలు మరువలేనివి.

### జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 26:** మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహా నుభావాల త్యాగాలు మరువలేనివని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ పేర్కొన్నారు. సోమవారం 77, వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ....ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని అటువంటి త్యాగమూర్తులను మనము మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనన్నారు. జిల్లాలో పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులు బాధ్యతగా తమ విధులు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో వినూత్నమైన, ఆదర్శనీయమైన సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే రోజులలో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని మనం చేసే ప్రతి కార్యక్రమం మన భావితరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి రాము నాయక్, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నా టిడిపి నేత వహీద్ హుసేన్.







**ఆంధ్ర ప్రగతి కర్నూల్ జనవరి 26:** కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో టిడిపి నేత, ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి వాహిద్ హుసేన్ పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండ ఎగురవేసి, వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వహీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం దేశానికి ఇచ్చిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలు ప్రతి పౌరుడు కాపాడాల్సిన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు బలపడితే దేశం బలపడుతుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అసలైన శక్తి అని వహీద్ హుస్సేన్ పేర్కొన్నారు. దేశాభివృద్ధికి యువత, పార్టీ కార్యకర్తలు బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, టీడీపీ పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాలలో జిల్లాలో వైభవంగా 77వ

# గణతంత్ర దినోత్సవ వేడుకలు..!

**పరేడ్ మైదానంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ సంబరాలు. -జాతీయ పతాకావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి రాజకుమారి.**
**నంద్యాల పరేడ్ మైదానంలో దేశభక్తి సందడి అలరించిన శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 26:**
సోమవారం ఉదయం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరేడ్ మైదానంలో 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ప్లాటూన్లు క్రమశిక్షణతో మార్చ్‌పాస్ట్ నిర్వహించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఉప్పర వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు నరహరి విశ్వనాథ రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లాభివృద్ధిపై గణతంత్ర సందేశం అందించారు. 2025 రబీ సీజన్‌లో సాధారణంగా సాగు చేయాల్సిన 1 లక్షా 73 వేల హెక్టార్లకు గాను, రైతులు ఇప్పటివరకు 1 లక్షా 76 వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లాలోని 2,06,052 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.280 కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. 2025 రబీ సీజన్‌లో బ్యాంకుల ద్వారా 1,25,650 మంది రైతులకు రూ.1,920 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే ఈ ఏడాది అదనంగా 65 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచగలిగామని అన్నారు. జిల్లాలో 48,250 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగుచేస్తూ 14.27 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నామని, ఈ ఏడాది అదనంగా 9 వేల ఎకరాల్లో పండ్ల తోటల సాగును విస్తరించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 7 వేల హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చేపల ఉత్పత్తి రంగంలో ఈ ఏడాది 40 వేల మెట్రిక్ టన్నుల నుండి 61 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉత్పత్తిని పెంచగలిగామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి గత ఖరీఫ్‌లో 5,98,779 ఎకరాలకు సాగునీరు అందించగా, ఈ రబీ సీజన్‌లో 1,92,263 ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వివరించారు. జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత తాగునీటి సరఫరా కోసం రూ.110 కోట్లతో చేపట్టిన 420 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలోని 3,14,118 మంది విద్యార్థుల తల్లులు, సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో లబ్ధిని జమ చేసినట్లు చెప్పారు. పదవ తరగతి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 58 లక్షల పని దినాల లక్ష్యంతో ఇప్పటివరకు 53.42 లక్షల పని దినాలు కల్పించి రూ.140 కోట్లను వేతనాల రూపంలో చెల్లించినట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ ద్వారా రూ.259 కోట్ల పెట్టుబడితో 3,870 సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి 17,601 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా 19,226 మంది గర్భిణీలు, బాలింతలు, 80,832 మంది చిన్నారులకు సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. దీపం పథకం కింద నాలుగు విడతలుగా 12,09,270 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.100.40 కోట్లను నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా జిల్లావ్యాప్తంగా రూ.825 కోట్లతో 246 రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లాలో ఉపాధి కల్పనలో భాగంగా 60 జాబ్ మేళాలు నిర్వహించి 5,285 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రూ.108.24 కోట్ల వ్యయంతో 52,475 మందికి శస్త్ర చికిత్సలు అందించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2,13,630 మందికి ప్రతినెల రూ.92.41 కోట్లను 1వ తేదీన పంపిణీ చేస్తున్నామని తెలిపారు.





హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,025 కోట్ల అంచనాతో మంజూరైన 56,957 గృహాల్లో 33,564 గృహాల నిర్మాణం పూర్తయినట్లు కలెక్టర్ వివరించారు.
అనంతరం సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్, నెరవాడ బీసీ వెల్ఫేర్, గురు రాజా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక నృత్యాలు, గేయాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ తదితర జిల్లా అధికారులు సందర్శించారు. స్టాళ్లలో జిల్లా ఉద్యానవన శాఖకు మొదటి బహుమతి, డీఆర్‌డీఏకు రెండవ బహుమతి, మెప్మాకు మూడవ బహుమతి లభించాయి. శకటాల ప్రదర్శనలో నంద్యాల మున్సిపాలిటీకి మొదటి బహుమతి, శ్రీశైలం దేవస్థానానికి రెండవ బహుమతి, రోడ్డు రవాణా శాఖకు మూడవ బహుమతి లభించాయి. ఆర్‌డబ్ల్యూఎస్, పీఓఐటీడీఏ శాఖలు కన్సోలేషన్ బహుమతులు పొందాయి.


# 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో

# పాల్గొన్న తాటికొండ బుగ్గరాముడు.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:**
నంద్యాల పట్టణ శివారులోని 38వ వార్డు నందమూరి నగర్ నందు గల పురపాలక ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు వైభవంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా 38వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైయస్సార్ నగర్ 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు మాట్లాడుతూ.. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులకు నాయకులకు విద్యార్థిని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిదంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉర్దూ డి ఐ హాసముద్దీన్ శాలువతో సత్కరించడం జరిగింది. అలాగే హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి కి కూడా వారి చేతుల మీదగా సత్కరించటం జరిగింది. అలాగే సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు అదేవిధంగా గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు, మరియు వ్యాసరచన పోటీల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఆయన చేతుల మీదగా బహుమతులు అందజేయడం జరిగింది.



అదే విధంగా రాబోయే రోజుల్లో మంత్రి ఎన్ ఎండి. ఫరూక్, అలాగే వారి కుమారులు ఎన్ ఎండి. ఫిరోజ్, ఫయాజ్ ఆధ్వర్యంలో పాఠశాలను మరింత అభివృద్ధి బాటలో ముందుకు తీసుకొని వెళతాం అని 38వ టిడిపి ఇన్చార్జ్ తాటికొండ బుగ్గ రాముడు అన్నారు. అదే విధంగా పాఠశాల అవసర సహాయార్థం తనవంతుగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ డి ఐ హాసముద్దీన్, పాఠశాల హెడ్ మాస్టర్ నారాయణ రెడ్డి, టీచర్ పీరా సాహెబ్, స్థానిక టీడీపీ నాయకులు తాటికొండ మహేష్ బాబు, హిమామ్ హుస్సేన్, వడ్డే నాగేంద్ర, టీడీపీ జిల్లా సెక్రటరీ సౌభాగ్యవతి మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 27 జనవరి 2026

### గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విజయకేతనం ఎగురవేసి..

# ప్రథమ బహుమతి సాధించిన శ్రీగురురాజాస్కూల్ విద్యార్థులు.

**-గణతంత్ర దినోత్సవ వేడుకలలో గురు రాజా విద్యార్థుల అద్భుత నృత్య రూపక ప్రదర్శన.**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ల చేత ప్రథమ బహుమతి అందుకున్న కళాశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:** నంద్యాల జిల్లా లో77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో పి.ఎస్ .సి అండ్ కే.వి.ఎస్.సి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీ నందుగల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ 450 మంది విద్యార్థులతో ప్రదర్శించిన నృత్య రూపకళా ప్రదర్శన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి, జాయింట్ కలెక్టర్ ,ఎస్పీ చే ప్రథమ బహుమతిని అందుకున్నారు. చరిత్ర పుటలలో హైందవ జాతి కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మరియు శంభాజీ గార్ల జీవిత గాధను ఆనాటి చారిత్రక ఘట్టాలను, జాతీయత, దేశభక్తి భావాలు ఉట్టిపడే విధంగా నృత్య ప్రదర్శనలు, యుద్ధ సన్నివేశాలు, ఆహుతులను, అధికారులను, పుర ప్రముఖులను కనువిందు చేశాయి. నేటి తరం చిన్నారులలో జాతీయత, దేశభక్తి ,స్వాతంత్ర ఘట్టాలు, చారిత్రక సన్నివేశాలు ఎలా ఉంటాయో విద్యార్థులకు ఒక నృత్య రూపకం ద్వారా సందేశాన్ని అందించాలని సదుద్దేశంతో 450 మంది విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని ప్రదర్శించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి .షేక్షావలి రెడ్డి తెలిపారు.. ఈ ప్రదర్శన కోసం చిన్నారుల కోసం శిక్షణ అందించిన డాన్స్ మాస్టర్లను, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా అభినందన తెలిపారు. జిల్లా కలెక్టర్ గారు , జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ చే ప్రత్యేక అభినందనలు అందుకోవడం ఆనందదాయకమని విద్యార్థుల విజయాలు అభినందించారు.





# బండ్ల గణేష్ ను సన్మానించిన టిడిపి నేత వహిద్ హుసేన్.!




**ఆంధ్ర ప్రగతి కర్నూల్ జనవరి 26:** శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కు తీర్చుకునేందుకు కాలి నడకన తిరుమల యాత్రకు బయలుదేరిన సినీ నిర్మాత బండ్ల గణేష్ ను టిడిపి నేత, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరి వాహిద్ హుసేన్ ఘనంగా సన్మానించారు. సోమవారం కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకున్న బండ్ల గణేష్ ను వాహిద్ హుసేన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తే కాలి నడకన తిరుమల దర్శనానికి వస్తానని ఆ దేవదేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కుకున్న సినీ నిర్మాత శ్రీ బండ్ల గణేష్ , తాను ఆకాంక్షించిన విధంగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అవడంతో, మొక్కు తీర్చుకునేందుకు కాలి నడకన తిరుమల యాత్రకు బయలుదేరారు.

ఈ పాదయాత్రలో భాగంగా ఈ రోజు కర్నూలు పరిసర ప్రాంతానికి చేరుకున్న సందర్భంగా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుస్సేన్ బండ్ల గణేష్ ని కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వహీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. బండ్ల గణేష్ ఈ కాలి నడక పాదయాత్ర కేవలం భక్తి భావనకే పరిమితం కాకుండా, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, టీడీపీ కుటుంబ సభ్యులకు గొప్ప ప్రేరణనిచ్చింది. పార్టీ పట్ల బాధ్యతను మరింత పెంచిన ఈ నిర్ణయం అభినందనీయం" అని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వహీద్ హుస్సేన్ ఆకాంక్షించారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ తులసి రెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జనవరి 26:** నంద్యాల మండలం లోని ఎన్ కొత్తపల్లె గ్రామంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఏపి స్టేట్ మార్క్ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. జెండ వందనం స్వీకరించారు. అనంతరం, జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారతదేశ గణతంత్ర దినోత్సవ ప్రత్యేకతను తులసి రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఉన్నత పాటశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తులసిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. పాటశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా జరిగిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం, గ్రామంలోని సచివాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తులసి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న దేరెడ్డి.శివనాగిరెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 26:** నంద్యాల పట్టణం లోని నందమూరి నగర్ హై స్కూల్ నందు 77వ సంవత్సర గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ 77 వ సంవత్సర గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉర్దూ స్కూళ్ల తనిఖీ అధికారి 31 వార్డ్ టిడిపి ఇంచార్జ్ దేరెడ్డి శివరాగిరెడ్డి తో పాటు అసముహిద్దిన్, స్కూలు కమిటీ చైర్మన్ ముబీనా, వైస్ చైర్మన్ పార్వతీ భాయి, వార్డు కౌన్సిలర్ టి. సావిత్రమ్మ, టిడిపి నంద్యాలజిల్లా సెక్రెటరీ సౌభాగ్యవతి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వీరి తల్లిదండ్రులు ఈ సభలో పాల్గొనడం జరిగినది. నందమూరి నగర్ యూపీ స్కూల్ ను, హైస్కూల్ గా ప్రమోట్ చేసినందుకు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ గారు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ కు, దేరెడ్డి శివనాగిరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థిని విద్యార్థులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మొదటి బహుమతి ,రెండవ బహుమతులు ఉర్దూ స్కూలు తనిఖీ అధికారి అసముద్దీన్ గారి చేతుల మీదుగా మరియు 38 వార్డ్ టిడిపి అధ్యక్షులు, ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి గారి చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఎంఎస్ కేబుల్ నెట్వర్క్ న్యూస్ కోవెలకుంట్ల రిపోర్టర్ ఎస్ ఎస్ బి శివన్న సహకారంతో బహుమతులు బహుకరించడమైనది.




# ఉత్తమ అవార్డు అందుకుంటున్న సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జనవరి 26:** నంద్యాల జిల్లా డోన్ పట్టణం లో నివసిస్తున్న పి.మహమ్మద్ రఫి సామాజిక కార్యకర్త గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మన భారత దేశ స్వతంత్ర్య సమరయోధుల మరియు శాస్త్రవేత్తల, సంఘసంస్కర్తల జయంతులు , వర్ధంతుల గురించి నియోజకవర్గంలోని స్కూల్స్ విద్యార్థులకు, ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థుల్లో వారి యొక్క స్ఫూర్తిని నింపుతూ ప్రజలను విద్యార్థులను చైతన్య పరుస్తూ విద్యార్థులకు అరోగ్యం పై అవగాహణ కల్పిస్తూ సమాజంలో తమ వంతు సామాజిక భాద్యతగా చేస్తున్న సేవలకు మరియు స్కూల్స్,

కళాశాలలలో విద్యార్థులకు, ప్రజలకు ఆరోగ్యం పై వాతవరణ కాలుష్యం పై వ్యక్తిగత శుభ్రత పరిసరాల పరిశుభ్రతల పై అవగాహణ కలిగిస్తున్నాను. శాస్త్రవేత్తలు గ్లోబల్ వార్మింగ్ పై హెచ్చరిస్తున్నారని తెలియజేస్తున్నాను. అలాగే బయటదొరికే ఫాస్ట్ ఫుడ్స్ ఆహారం, కల్తీ ఆహర పదార్థాల పై అవగాహణ కలిగి వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలని విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ - ఓజోన్ పొరను రక్షించుకోవాలని స్మార్ట్ ఫోన్ ఎక్కువ వాడకుడదని తెలిపారు. ఎక్కువగా వాడటం ద్వారా జ్ఞాపకశక్తి తగ్గడం, అసహనం, చిరాకు లాంటి పలు రకాల సమస్యలతో పాటు అది వారి మానసిక, శారీరక ఆరోగ్య పరిస్థితిపై



తీవ్ర ప్రభావం చూపుతుందని మరణించిన తర్వాత నేత్రదానం, బ్రెయిన్ డెడ్ ,యాక్సిడెంటు అయినటువంటి కేసులలో అవయవాల దానం చెయ్యవచ్చు. ప్రస్తుత సమాజంలో అవయవదానం అవసరం చాలా ఎక్కువ అగుచున్న తరుణంలో ప్రజల్లో విశృత స్థాయిలో అవగాహణ అవసరమన్నారు.ఆడ మగ ఇద్దరూ సమానమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని తెలియజేశారు. ఆడబిడ్డలను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం. అలాగే బాల్య వివాహాలు చేయకూడదని తెలియజేశారు. పిల్లలతో పని చేయించడం చట్టరిత్య నేరం. పిల్లలను బడిలో చేర్పించాలి. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే 1098 చైల్డ్ లైన్ కేంద్రానికి సమాచారం అందించాలని విద్యార్థులకు, ప్రజలకు అవగాహణ కల్పిస్తున్నారు. మూఢకమ్మకాలపై ,

ఓటు హక్కు వినియోగం పై లింగ నిర్ధారణ నివారణ చట్టాలపై, పల్స్ పోలియో పై పాఠశాలల్లో,కాలేజీల్లో విద్యార్థులకు అవగాహణ కార్యక్రమాలు చేస్తూ మరియు పత్రికల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజలకు అవగాహణ కల్పిస్తూ సమాజంలో నా వంతు సామాజిక భాద్యతగా చేస్తున్న సేవలకు గుర్తించి ముఖ్యంగా నేను 2020 లో మార్చి చివరి వారం నుండి కరోనా వైరస్ (కోవిడ్ 19) పై అవగాహణ కల్పిస్తూ ముందు జాగ్రత్త కరపత్రాలను డోన్ మున్సిపల్ కమీషనర్ జిల్లా డి యం హెచ్ ఒ ,డోన్ ఆరోగ్య విస్తరణ అధికారి విడుదల చేసిన కరోనా వైరస్ ముందు జాగ్రత్తల (కోవిడ్ 19) కరపత్రాలను లాక్ డౌన్ ఎత్తివేసె వరకు పంపిణీ చేస్తూ కరోనా పై అవగాహణ కల్పించినందుకు గాను నా సేవలకు ప్రభుత్వం గుర్తించి నంద్యాల పి యస్ సి & కె వి యస్ సి గవర్నమెంట్ డిగ్రీ కాలేజి నందు ఏర్పాటు చేసిన 77వ మన దేశ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా మరియు జాయింట్ కలెక్టర్ కార్తీక్ డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ రాము నాయక్ జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ చేతుల మీదుగా కమాండేషన్ సర్టిఫికెట్ (ప్రశంశా పత్రం)అందుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ అవార్డు పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రశంసా పత్రం పొందడం మరింత బాధ్యతను పెంచిందని ప్రజలకు సేవచేయడం తమ వంతు బాధ్యతగా నిర్వహిస్తామని తెలిపారు. స్వాతంత్రసమరయోధులు, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు చేసిన సేవలే ఈనాడు మనం ఇంత సంతోషంగా , స్వేచ్ఛగా జీవిస్తున్నాం. కావున వారిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత వహించి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.